గడువులోపు పెండింగ్ చలాన్లు చెల్లించాలి

ఇంద్రవెల్లి, జనవరి 24: వాహనాలదారులు గడువులోపు పెండింగ్ చలాన్లు చెల్లించి రాయితీ పొందాలని ఏఎస్సై లక్ష్మణ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ చలాన్లు చెల్లించేందుకు ప్రభుత్వం ఈ నెల 31వరకు గడువు పొడిగించడంతో వాహనదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రతీ వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. లేని పక్షంలో చట్టరీత్య చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.



● జిల్లా కేంద్రంలోని ఇండస్ట్రియల్ పార్కు




కబ్జాకోరల్లోకి.. పరిశ్రమల భూములు

- జిల్లాలో కబ్జాదారుల కన్నుపడి కనుమరుగవుతున్న ఇండస్ట్రియల్ పార్కు భూములు
- నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార సముదాయాల ఏర్పాటు
- నోటీసులతోనే సరిపెడుతున్న కార్పొరేషన్ అధికారులు
- పూర్తిగా కొరవడిన టీఎస్ఐఐసీ అధికారుల పర్యవేక్షణ
- కబ్జాదారులకు వరంగా మారిన వైనం
- 1973లో దస్నాపూర్ కాలనీలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు
- ప్రారంభంలో 37 ఎకరాలు.. ప్రస్తుతం 20 ఎకరాలకు తగ్గిన విస్తీర్ణం
- ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి 17 ఎకరాలకు పైగా పరిశ్రమల భూమి

ఆదిలాబాద్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ పార్కు భూములు కనుమరుగవుతున్నాయి. కొందరు వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. 1973 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకేంద్రంలోని దస్నాపూర్ కాలనీలో ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేసింది. దీని నిర్వాహణ బాధ్యతను టీఎస్ఐఐసీ (తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్)కు అప్పగించింది. ఇండస్ట్రియల్ పార్కులో ఏర్పాటు చేసిన పలు పరిశ్రమలు కాలక్రమంగా మూతబడడం, సంబంధిత కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యంతో కబ్జాదారులకు వరంగా మారింది. ప్రారంభంలో 37 ఎకరాల విస్తీర్ణంలో ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేశారు. కానీ, ప్రస్తుతం 20 ఎకరాల విస్తీర్ణంలోనే ఇండస్ట్రియల్ పార్కు ఉందని అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. సుమారుగా 17 ఎకరాలకు పైగా పరిశ్రమల భూమి ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయినట్లు కనిపిస్తుంది. జిల్లాకేంద్రం నడిబొడ్డున ఉండడం.. చుట్టూ నివాస ప్రాంతాలు ఏర్పడడంతో ఈ భూములకు భారీ డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం ఎకరాన కోట్ల రూపాయలలో డిమాండ్ పలుకుతోంది. మొదట 49 పరిశ్రమలు 20 షెడ్లతో ప్రారంభమైన ఈ ఇండస్ట్రియల్ పార్కు.. ప్రస్తుతం రెండు, మూడు పరిశ్రమలతోనే కొనసాగుతోంది. కొందరు వ్యాపారులు ఈపార్కుపై కన్నేసి కొత్త నిర్మాణాలతో అడ్డగోలుగా వ్యాపారాలను చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు కూడా లేకుండా భారీ నిర్మాణాలు చేపడుతూ అక్రమాలకు పాల్పడుతున్న అడిగే వారే కరువవుతున్నారు.

లీజు పేరిట అక్రమదందాలు

ఇండస్ట్రియల్ పార్కులో మూతబడిన పరిశ్రమలను లీజుకు తీసుకుంటూ కొందరు వ్యాపారులు కొత్త వ్యాపారాలను మొదలు పెడుతున్నారు. అసలు నిబంధనల ప్రకారం ఇండస్ట్రియల్ పార్కులో ఎలాంటి జన సంచారంతో కూడిన పరిశ్రమలయేతర వ్యాపారాలు చేసేందుకు అనుమతులు ఉండవు. కానీ కొందరు వ్యాపారులు.. దీనికి విరుద్ధంగా వ్యాపార సముదాయాలను ఏర్పాటు చేస్తూ అడ్డగోలు సంపాదనకు ఎగబడుతున్నారు. ప్రమాదకరమైన పరిశ్రమల ప్రాంతంలో ఏదైనా జరుగకూడని ప్రమాదం జరిగితే బాధ్యులెవరన్న వాదనలు వినిపిస్తున్నాయి. పరిశ్రమల పార్కులో ఇతర వ్యాపారాలు చేసేందుకు అవకాశం లేదు. ముఖ్యంగా చిన్నపిల్లలకు ఆహ్లాదకరమైన పార్కులతో పాటు స్కూల్స్, రెస్టారెంట్, సూపర్‌మార్కెట్, ఫంక్షన్ హాల్స్‌లను యథేచ్ఛగా ఏర్పాటు చేస్తున్నా.. అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఖయిలా పడిన పరిశ్రమలను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాల్సిన అధికారులే అక్రమ వ్యాపారాలకు అండగా నిలుస్తున్నారు. ఒకవేళ వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేయాలంటే ఇండస్ట్రియల్ నుంచి కమర్షియల్‌గా మార్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఇవేమీ పట్టించుకోకుండా అడ్డగోలు వ్యాపారాలకు ఎగబడుతున్నారు.



● ఆదిలాబాద్ పట్టణంలో ఇండస్ట్రియల్ పార్కును చూపే బోర్డు

కోట్ల పన్ను బకాయిలు

ఇండస్ట్రియల్ పార్కులో నిర్మించిన భారీ నిర్మాణాలకు ఎలాంటి ఆస్తి పన్ను చెల్లించకుండా వ్యాపారం కొనసాగిస్తున్నట్లు తెలుస్తుంది. ఇండస్ట్రియల్ పార్కు మున్సిపల్ పరిధిలోకి రాదంటూ మున్సిపల్ అధికారులు కూడా పన్ను వసూలపై దృష్టి సారించడం లేదు. అటు టీఎస్ఐఐసీకి.. ఇటు మున్సిపల్‌కు పన్ను చెల్లించకుండానే ఏళ్ల తరబడి పన్నుకు ఎగనామం పెడుతూ వస్తున్నారు. ఏదో ఫిర్యాదులు రాగానే నోటీసులు ఇవ్వడం, వ్యాపారుల నుంచి అందినకాడికి దండుకోవడం అధికారులకు అలవాటుగా మారిందంటున్నారు. ఈ వ్యవహారంలో లక్షల రూపాయలు చేతులు మారినట్లు ఆరోపణలు వస్తున్నాయి. గడువులోగా సమాధానం చెప్పాలంటూ సంబంధిత వ్యాపారులకు నోటీసులు జారీ చేస్తూ.. ఆ తర్వాత అసలు విషయాన్నే మరిచిపోవడంతో ఈ అక్రమ దందాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ఇలా పలుమార్లు నోటీసులు ఇచ్చినా.. ఇప్పటి వరకు ఏఒక్క వ్యాపార సంస్థపై చర్యలు తీసుకోకపోవడంతో మరికొన్ని వ్యాపార సముదాయాలు పుట్టుకొస్తూనే ఉన్నాయి. అలాగే పరిశ్రమల యజమానులు ఆస్తి పన్నును చెల్లించడంలో తీవ్రజాప్యం చేయడంతో కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోతున్నాయి.

కొరవడుతున్న పర్యవేక్షణ

టీఎస్ఐఐసీ కార్పొరేషన్ అధికారులు పత్తా లేకుండా పోవడంతో పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. దీంతో ఇండస్ట్రియల్ పార్కు భూములకు భద్రత లేకుండానే పోయింది. గత కొన్నేళ్లుగా నిజామాబాద్ జిల్లాకు చెందిన అధికారులే ఇన్‌చార్జీలుగా కొనసాగడంతో ఇండస్ట్రియల్ పార్కుపై అసలు పట్టింపే లేకుండా పోతుంది. ఇండస్ట్రియల్ పార్కు చుట్టూ ఉన్న నివాసా ప్రాంతాల ప్రజలు పార్కు భూముల్లోకి చొచ్చుకు రావడంతో పాటు యథేచ్ఛగా హద్దులు ఏర్పాటు చేసుకుంటున్నారు. కొందరైతే తమ అధీనంలో ఉన్న పరిశ్రమల భవనాలతో పాటు భూములను ఇష్టానుసారంగా విక్రయిస్తున్నారు. కార్పొరేషన్ అధికారుల అనుమతులు లేకుండానే విక్రయాలు జరుగుతున్నా.. యథేచ్ఛగా రిజిస్ట్రేషన్‌లు జరిగిపోతున్నాయి. అలాగే ప్రభుత్వానికి చెల్లించాల్సిన కోట్ల రూపాయల ఆస్తి పన్నుకు ఎగనామం పెడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే అడుగడుగునా అక్రమాలే చోటు చేసుకుంటున్నాయి.



రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది

: శైలజ, మున్సిపల్ కమిషనర్, ఆదిలాబాద్



జిల్లా కేంద్రంలోని దస్నాపూర్‌లో ఇండస్ట్రియల్ పార్కు భూములు మున్సిపల్ పరిధిలోకి రావు. దీనిపై ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించడం జరిగింది. ఇంకా స్పష్టత రాలేదు. ఈ విషయాన్ని ఇండస్ట్రియల్ పార్కు అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఇండస్ట్రియల్ పార్కును ప్రభుత్వం మున్సిపాలిటీకి అప్పగిస్తే అన్నిరకాల అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంటుంది. అలాగే పన్ను వసూళ్లలో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

సంక్షిప్త సమాచారం



అంగన్‌వాడీ టీచర్లకు సూచనలు చేస్తున్న సీడీపీవో

పిల్లల ఎదుగుదల, పర్యవేక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ఇచ్చోడ, జనవరి 24: చిన్నారుల ఎదుగుదల, పర్యవేక్షణపై అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ప్రత్యేకశ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ సీడీపీవో సౌందర్య అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని రైతు వేదిక భవనంలో అంగన్‌వాడీ టీచర్లకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, గర్భిణుల గృహ సందర్శన, మాతృ మరణాలు, శిశుమరణాలు జరగకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గంలోని ఐదు మండలాల అంగన్‌వాడీ టీచర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు భారీ స్పందన

ఆదిలాబాద్ అర్బన్, జనవర 24: పట్టణంలోని ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు అనుహ్య స్పందన వచ్చింది. కళాశాలలో ఐదు కంపెనీల ప్రతినిధులు పాల్గొని వారి జాబ్ ఆఫర్లను అభ్యర్థులకు తెలిపారు. పలువురు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తులు చేసుకోగా ఎంపికైన వారికి కళాశాల ప్రిన్సిపాల్ అనిత జాబ్ లెటర్‌ను అందించారు. అంతకుముందు సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ముఖ్య అతిథిగా హాజరై జాబ్‌మేళాను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డిగ్రీ అనంతరం జాబ్ రావడం సంతోషంగా భావించాలన్నారు. తమవద్ద ఉన్న టాలెంట్‌తో అనేక ఉద్యోగాలు సాధించవచ్చని తెలిపారు. ప్రైవేట్ రంగంలో ఉద్యోగం చేస్తూ అవసరమైతే ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధం కావాలని, ఇలాంటి జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇచ్చోడలో అటవీశాఖ తనిఖీలు

ఇచ్చోడ, జనవరి 24: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఇళ్లను టాస్క్‌ఫోర్స్ ఎఫ్ఆర్‌వో వాహబ్ అహ్మద్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమంగా కలప నిలువ చేసిన, అక్రమంగా రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో టాస్క్ ఫోర్స్ సిబ్బంది గులాబ్, సజన్‌లాల్, శ్యాంసుందర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 24: అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయ నాయకులు వస్తుంటారు పోతుంటారు కానీ, పేదలకు అందాల్సిన సంక్షేమ పథకాల ఫలాలను వారికి అందించాల్సిన బాధ్యత అధికారంలో ఉన్న ఎమ్మెల్యేలకు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, బీజేపీ జిల్లా నాయకులు, కార్యకర్తలున్నారు.

గణతంత్ర దినోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు

● పరేడ్‌ను పరిశీలించిన ఎస్పీ గౌస్‌ఆలం ● జిల్లాకేంద్రంలోని పోలీసు ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో వేడుకలు ● ఏర్పాట్లలో నిమగ్నమైన సిబ్బంది



ఆదిలాబాద్ అర్బన్, జనవరి 24: దేశానికి రాజ్యాంగం అమలు సందర్భంగా నిర్వహించుకునే అతిపెద్ద పండుగ గణతంత్ర దినోత్సవమని, వేడుకలకు ముమ్మ ర ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని జిల్లా పోలీసు ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో పోలీసుల పరేడ్‌ను ఎస్పీ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో 6ప్లాటూన్‌లతో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ నవీన్ ఆధ్వర్యంలో స్పెషల్ పార్టీ, ఏఆర్ సిబ్బంది, హోంగార్డ్స్, ఎన్‌సీసీ విద్యార్థులతో పరేడ్‌ను నిర్వ హించనున్నట్లు తెలిపారు. అలాగే ముఖ్య అతిథులకు వేదికను అత్యంత సుందరంగా అలంకరించాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు, అతిథులు, సిబ్బంది, స్టాల్స్ శకటాలు ఏర్పాటుకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. హెడ్‌క్వార్టర్స్ ముఖ ద్వారం నుంచి మైదానం వరకు ఇరువైపుల రంగురంగుల జెండాలతో ముస్తాబు చేయాలని, హెడ్‌క్వార్టర్ మొత్తాన్ని నూతన రంగులను వేసి పరిశుభ్రతతో ఉంచాలని సూచించారు. ఇందులో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు నవీన్, మురళి, కార్తిక్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● భరోసా సెంటర్‌లో ఉద్యోగాలు : ఎస్పీ

ఆదిలాబాద్ అర్బన్: అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు ఉమెన్ సేఫ్టీ వింగ్(షీ టీమ్స్, భరోసా) తెలంగాణ హైదరాబాద్ ఆదేశాల మేరకు జిల్లాలో కొత్తగా ఏర్పాటవుతున్న భరోసా సెంటర్‌లో తాత్కాలిక ప్రాదిపదికన ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎస్పీ గౌస్‌ఆలం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా భరోసా సెంటర్‌లో వివిధ కేటగిరిలలో ఐదు ఖాళీలు ఉన్నాయని, ఈ పోస్టులకు యువతులు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇందులో కౌన్సిలర్ కం సెంటర్ కోఆర్డినేటర్-1, సపోర్టు పర్సన్-2, రిసెప్షనిస్టు-1, ఏఎన్ఎం-1 పోస్టులు ఉన్నాయన్నారు. కౌన్సిలర్ కం సెంటర్ పోస్టుకు 25 నుంచి 45 ఏళ్ల లోపు మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని, విద్యార్హత ఎంఎస్‌సీ/ఎంఎ సైకాలజీ లేదా మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ చదివి ఉండాలన్నారు. మహిళలు, పిల్లలకు సైకో సోషల్ కౌన్సెలింగ్ అందించడంలో 24 నెలల కంటే తక్కువ అనుభవం ఉండరాదని తెలిపారు. అలాగే సపోర్టు పర్సన్ ఉద్యోగానికి 25నుంచి 35 ఏళ్ల లోపు మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని, సోషల్ వర్క్, చైల్డ్ డెవలప్ మెంట్/సైకలాజిస్టు పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీ విద్యార్థత ఉండాలన్నారు. 12నెలల కంటే తక్కువ అనుభవం ఉండరాదని, బాలల హక్కులు లేదా పిల్లల రక్షణ రంగంలో పని చేసిన అనుభవం కలిగి ఉండాలని తెలిపారు. అలాగే రిసెప్షనిస్టు ఉద్యోగానికి 25 నుంచి 35ఏళ్ల లోపు మహిళ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, గ్రాడ్యూయేట్, కంప్యూటర్ లిటరేటు, అకౌంటింగ్ సాఫ్ట్‌వేర్ పరిజ్ఞానం ఉన్న దరఖాస్తుదారులకు ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. 24 నెలల కంటే తక్కువ అనుభవం ఉందరాదని తెలిపారు. ఏఎన్ఎం పోస్టుకు 25 నుంచి 35ఏళ్ల లోపు మహిళా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని, బీఎస్‌సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం, గైనకాలజిస్టు/పిడియాట్రిషియన్/సర్జన్తో 24 నెలలకు తక్కువ కాకుండా పని చేసిన అనుభవం ఉండాలన్నారు. లేదా ఐసీయూ, అత్యవసర చికిత్సలలో అనుభవం ఉండి ఎంటీపీ/అబార్షన్, డెలివరి విధానాలను చేపట్టి ఉండాలని లేదా సహాయం చేసి ఉండాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు పూర్తి సమారం కోసం జిల్లా పోలీసు కార్యాలయంలోని డీసీఆర్‌బీ సెక్షన్ ఎస్సై హాకీం ఫోన్ నెం.8712566264కు ఫిబ్రవరి 1లోపు దరఖాస్తులు అందజేయాలని ఆయన పేర్కొన్నారు.



గౌరవ వందనం సమర్పిస్తున్న పోలీసులు(ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న ఎస్పీ)



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

'ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు'

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 24: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ పీఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రోడ్డు భద్రత, ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా ఎస్పీతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జాతీయ, ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్ రహదారులపై ప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించి నియంత్రణకు ముందస్తు చర్యల్లో భాగంగా సూచిక బోర్డులను వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం ఎస్పీ గౌస్‌ఆలాం మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పోలీసు శాఖ ద్వారా వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ముఖ్యంగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించక పోవడం, ఫోన్ మాట్లాడుతూ మద్యం తాగి అతివేగంగా వాహనం నడపడం, ట్రిపుల్ రైడింగ్, హైవెలపై రాంగ్‌సైడ్ పార్కింగ్, ట్రాఫిక్ సిగ్నల్ దాటడం అంశాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, ఆర్అండ్‌బీ ఈఈ నర్సయ్య, ఆర్డీవో స్రవంతి, పంచాయతీరాజ్ ఈఈ మహావీర్, రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్‌రాథోడ్, పోలీసు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికి తీయాలి

● సైన్స్‌ఫెయిర్‌ను తిలకించిన ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 24: విద్యార్థులలో ఉన్న నైపుణ్యాలను వెలికి తీసి ఆ నైపుణ్యాన్ని గుర్తించి ఉన్నత స్థానాలకు ఎదిగేలా కృషి చేయాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ అర్బన్ కేజీబీవీ విద్యాలయంలో నిర్వహించిన జిల్లాస్థాయి వైద్య విజ్ఞానిక ప్రదర్శన (సైన్స్‌ఫెయిర్) కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఎమ్మెల్యే పాయల ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువులో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. విద్యాశాఖ నిర్వహించే కార్యక్రమానికి నిధులు ప్రభుత్వం ఇవ్వక పోవడం బాధాకరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తమకు ఏ అవసరం ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని, సొంతంగా అయినా తన నిధులు వాటి కోసం ఖర్చు చేస్తానని భరోసానిచ్చారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లను ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్ అందించి అభినందించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఇందులో డీఈవో ప్రణీత, ఎంఈవో జయశీల, ఉపాధ్యాయులు, సిబ్బంది, బీజేపీ నాయకులున్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే, డీఈవో



పుణ్య స్నానానికి బయల్దేరిన జుగ్నాక్ వంశీయులు

పోల్లుగూడలో పెర్సపేన్ పూజలు

ఇంద్రవెల్లి, జనవరి 24: పుష్యమాసాన్ని పురస్కరించుకొని మండలంలోని వాల్గొండ గ్రామ పంచాయతీ పరిధిలోని పోల్లుగూడ గ్రామంలో జుగ్నాక్ వంశీయులు పెర్సపెన్ పూజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం జుగ్నాక్ వారి అల్లులు ఆలయం నుంచి దేవుడిని కిందకు దింపి ప్రత్యేక పూజల మధ్య అలంకరించారు. కటోడ జుగ్నాక్ మహాదు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కుకున్నారు. అనంతరం రాత్రి గ్రామం సమీపంలోని వాగు వద్ద పుణ్యస్నానానికి బయల్దేరారు. గురువారం రాత్రి మహాపూజ నిర్వహించనున్నట్లు జుగ్నాక్ వంశం పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ పెద్దలు పటేల్ జుగ్నాక్ గోదురావు, కటోడ జుగ్నాక్ మహాదు, గ్రామ పటేల్ కోరెంట పోల్లురావు, జుగ్నాక్ కాశీరాం, ఆత్రం శంకర్, జుగ్నాక్ భారత్, తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు చదువుకుంటేనే సమాజం అభివృద్ధి : రిటైర్డ్ ప్రొఫెసర్

తాంసి, జనవరి 24: ఆడపిల్లలు ఉన్నత విద్యను పొందితేనే హక్కులు, సమానత్వం సాధ్యమని, సమాజం అభివృద్ధి చెందుతుందని రిటైర్డ్ ప్రొఫెసర్ సల్ల విజయ్ బాబు పేర్కొన్నారు. బుధవారం తాంసి మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. బాలికల హక్కులు, విద్య, ఆరోగ్యం, పోషకాహారం యొక్క ప్రాముఖ్యతపై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా విజయ్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలకు వెళ్లడానికి లక్ష్యం కృషి ఉంటే విజయం మీతోడూ ఉంటుందని అన్నారు. పట్టుదల, ఏకాగ్రతతో చదివి జ్ఞానంతో లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. సెల్ ఫోన్ నియంత్రణ అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ ఇమ్రాన్ ఖాన్, పలువురు ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న రైల్వేలైన్ సాధన కమిటీ సభ్యులు

రైల్వేలైన్ సాధించే వరకూ పోరాటం

● సాధన కమిటీ ఆధ్వర్యంలో పట్టణబంద్

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 24: ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్ సాధించే వరకూ పోరాడుతామని రైల్వేలైన్ సాధన కమిటీ కన్వీనర్ నారాయణ అన్నారు. రైల్వేలైన్ సాధన కమిటీ నిరసన కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆదిలాబాద్ పట్టణబంద్‌కు పిలుపునిచ్చారు. ఈ మేరకు సాధన కమిటీల నాయకులు ప్రధాన కూడళ్లలో బైక్ ర్యాలీ నిర్వహిస్తూ తెరిచి ఉంచిన దుకాణాలను, షాపులను మూఇస వేయించారు. ఈ సందర్భంగా సాధన కమిటీ నాయకులు మాట్లాడుతూ రైల్వేలైన్ ఏర్పడితే ఆర్థికంగా, విద్యాపరంగా, వ్యాపారపరంగా ఆదిలాబాద్ ఎంతో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్ సాధించేంత వరకు తమ నిరసన కొనసాగుతూనే ఉంటుందన్నారు. ఇందులో రైల్వేలైన్ సాధనకమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం : రాష్ట్ర షూటింగ్ బాల్ సంఘం

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 24: తెలంగాణ నుంచి షూటింగ్ బాల్ పోటీల్లో రాణించే జాతీయ స్థాయి క్రీడాకారులను ప్రోత్సహించడానికి ముందుంటామని రాష్ట్ర షూటింగ్ బాల్ సంఘం అధ్యక్షుడు రవికుమార్, ఉపాధ్యక్షుడు డాక్టర్ క్రాంతికుమార్‌లు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మాస్టర్ మైండ్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి పోటీల్లో వారు పాల్గొని క్రీడాకారులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇందులో తెలంగణ రాష్ట్ర షూటింగ్ బాల్ సంఘం కోశాధికారి హరిచరణ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అజయ్, కళ్యాణ్, తదితరులున్నారు.

'పేదల సంక్షేమం కోసం కేంద్ర పథకాలు'

ఉట్నూర్, జనవరి 24: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలను పేద, బలహీన వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని ఎంపీ సోయంబాపురావు అన్నారు. బుధవారం మండలంలోని షాంపూర్ గ్రామీణ బ్యాంకు వద్ద ఏర్పాటు చేసిన మా సంకల్పం వికసితా భారత్ కార్యక్రమంలో హాజరై మాట్లాడారు. ఆయుష్మాన్ బారత్, పీఎంజన ఆరోగ్య యోజన పథకం ద్వారా కుటుంబానికి రూ.5లక్షల ప్రమాద బీమా సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన, ముద్ర రుణాలు లాంటివి ఎన్నో ప్రయోజనాలు కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లికా, వైస్ ఎంపీపీ దావులే బాలాజి, తదితరులున్నారు.


'2వరకు ఓటర్లు దరఖాస్తు చేసుకోవచ్చు'

ఉట్నూర్, జనవరి 24: ఓటు హక్కులేని వారి కోసం ఫిబ్రవరి 2 వరకు ఓటు హక్కు దరఖాస్తులు చేసుకోవచ్చని ఉట్నూర్ ఆర్డీవో జీవాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఓటు కోసం వచ్చే వారికి బూత్ ఏజెంట్లు సహకరించాలని, ఓటు నమోదు గురించి వివరించాలని ఆర్డీవో ఈ సందర్భంగా కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ భుజంగ్‌రావు, బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేశ్, ముజీబ్‌ఖాన్, రామగిరి వాసు, బీజేపీ నాయకులు వెంకటి, కాంగ్రెస్ నాయకులు అబ్దుల్‌కయ్యూమ్, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆధ్వర్యంలో డ్రైవర్స్‌డే

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 24: ప్రయాణికులను సురక్షితంగా వారివారి గమ్యస్థానాలకు చేర్పించడంలో ఆర్టీసీ డ్రైవర్ల పాత్ర ఎంతో కీలకమని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలేమాన్ పేర్కొన్నారు. బుధవారం ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో డ్రైవర్స్‌డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలేమాన్ మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థకు డ్రైవర్లు వెన్నెముక లాంటివారని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రయాణికులను సురక్షితంగా వారివారి గమ్యస్థానాలకు చేర్చడంలో డ్రైవర్లు ఎంతో కీలక పాత్ర పోషిస్తారన్నారు. అనంతరం డ్రైవర్లకు గులాబి పువ్వులను అందించి డ్రైవర్స్‌డే శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో డిపో సిబ్బంది, ఆర్టీసీ డ్రైవర్లు, సిబ్బంది, తదితరులున్నారు.





ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి
PVR ఆర్.కె. - బంజారాహిల్స్
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్
PVR గలేరియా - పంజాగుట్ట
PVR ఐకాన్ - హైటెక్‌సిటీ
PVR పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్
PVR పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్
PVR ప్రిస్టన్‌మాల్ - గచ్చిబౌలి
PVR ఆట్రియమ్ - గచ్చిబౌలి
PVR ఎస్‌2 నోమ - మల్లాపూర్
INOX జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్
INOX ఎం.పి మాల్ - కాచిగూడ
INOX జిఎస్ఎమ్ - మదీనగూడ
INOX నెక్లెస్ సత్వ - కవాడిగూడ
INOX అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్
Cinepolis మంజీరామాల్ - కూకట్‌పల్లి
Cinepolis సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి
Cinepolis మంత్రామాల్ - అత్తాపూర్
Cinepolis సుధా - శాలిబండ
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్
ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం
ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
సినీ ప్లానెట్ - కొంపల్లి
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఏషియన్ రాధిక - కాప్రా
ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
మిరాజ్ సినిమాస్ - బాలానగర్
మిరాజ్ సినిమాస్ - చందానగర్
లక్ష్మీనరసింహ - మియాపూర్
రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
MOVIETIME మూవీటైమ్ - అమీర్‌పేట
MOVIETIME ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
టివోలి - సికింద్రాబాద్
విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
షా షహెన్‌షా - చింతల్
లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్
మూవీమ్యాక్స్ - మౌలాలి
జె.పి.సినిమాస్ - చందానగర్

'రెవెన్యూ' వద్ద ఆ భూమి రికార్డుల్లేవ్!

- హైదరాబాద్-శ్రీశైలం హైవే భూమి వివరాలివ్వాలని ఎన్‌హెచ్ఏఐకు వినతి
- 'రహదారికీ రైతుబంధు'పై విస్తృత చర్చ
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై అధికారుల ఆరా

ఆమనగల్లు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 'రహదారికీ రైతుబంధు' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం సర్వత్రా చర్చనీయాంశమైంది. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి నిర్మించిన భూమికి ప్రభుత్వం ఏళ్లుగా రైతుబంధు సొమ్ము ఇస్తూ వచ్చిన వైనాన్ని 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టింది. అయితే రోడ్డు నిర్మించిన భూమికి సంబంధించి రెవెన్యూ అధికారుల వద్ద సరైన రికార్డులు లేనట్లు సమాచారం. దాంతో ఆ రికార్డులు అందజేయాలని రెవెన్యూ అధికారులు.. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులను కోరినట్లు తెలిసింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లో ఈ సమస్య వెలుగుచూసింది. రోడ్డు కోసం పట్టా భూములను సేకరించినా దానికి అనుగుణంగా రికార్డుల్లో మార్పు చేయలేదు. గత ప్రభుత్వ లోపాల వల్ల ఈ భూమికి రైతుబంధు సహాయం అందుతుండడమే కాక మరో సమస్య కూడా తలెత్తుతోంది. భూముల ధరలకు రెక్కలు వస్తుండడంతో చాలామంది రైతులు జాతీయ రహదారి ఉన్న భూమిని కూడా ధరణి రికార్డుల ఆధారంగా విక్రయించి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఇదే జరిగితే పెద్దఎత్తున వివాదాలు చోటు చేసుకునే అవకాశాలు లేకపోలేదు. ఇటీవల కడ్తాల- మైసిగండి మధ్య రోడ్డు నిర్మాణం జరిగిన 1.20 ఎకరాల భూమి.. ధరణి పాస్ పుస్తకంలో కూడా ఉండడంతో రూ.5 కోట్లకు విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దాన్ని వేరొకరికి రిజిస్ట్రేషన్ చేయకుండా బ్లాక్‌లిస్టులో పెట్టాలని రాష్ట్ర ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు అందింది.


హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి

కాగా, ఎన్‌హెచ్ఏఐ అధికారులను రికార్డులు అడగడంతో పాటు రోడ్డు ఉన్న సర్వే నంబరు భూములను పరిశీలించి సంబంధిత రైతుల రికార్డుల నుంచి ఆ భూమిని తొలగించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఇటు ప్రభుత్వం ఈ విషయమై ఉన్నతస్థాయి విచారణ జరిపిస్తే అనేక విషయాలు వెలుగుచూసే అవకాశం ఉందన్న అభిప్రాయం స్థానిక ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ఆమనగల్లుకు చెందిన ఓ రైతు ఇటీవల స్థానిక తహసీల్దార్‌కు, కడ్తాల్‌కు చెందిన మరో రైతు ప్రజావాణిలో సీఎం రేవంత్ రెడ్డికి ఇదే విషయమై ఫిర్యాదు చేశారు.

కేసీఆర్‌ను సీఎం చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బాధాకరమేమీ కాదని, చాలా చిన్న దెబ్బ మాత్రమే తగిలిందని అన్నారు. "ప్రజలు మనల్ని ఛీకొట్టలేదు. 39 స్థానాల్లో గెలిచాం. మరో 14 స్వల్ప తేడాతో ఓడాం. ఆ 14 స్థానాల్లో ఇతర పార్టీలు గతంలో రెండు, మూడు, నాలుగుసార్లు వరుసగా పోటీచేసి.. ఒక్కసారైనా గెలిపించాలంటూ ఏడవడంతో ప్రజలు భావోద్వేగాలతో వారికి ఓటేశారు. ఇందులో ఆరేడు స్థానాలు బీఆర్ఎస్ గెలిస్తే ఎలా ఉండేది? 1.85 శాతం ఓట్ల తేడాతో మాత్రమే అధికారం కోల్పోయాం" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజల తీర్పు ను అవమానపరిచే విధంగా మాట్లాడవద్దని పార్టీ శ్రేణులు, సోషల్ మీడియా వారియర్స్‌కు సూచించారు. "కరీంనగర్ లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో కరీంనగర్, సిరిసిల్ల, హుజూరాబాద్‌లో గెలిచాం. మిగిలిన నాలుగింటిలో కూడా వారు సానుభూతితోనే గెలుపొందారు. అయినా మనకంటే వారికి కేవలం ఐదారు వేల ఓట్లు మాత్రమే ఎక్కువ వచ్చాయి. ఈ ఏడుపు, సానుభూతి ఎప్పటికీ ఉండదు" అని వ్యాఖ్యానించారు.

420 హామీలతో ప్రజలను నమ్మించారు..

ఎన్నికల్లో తప్పుడు హామీలతో రేవంత్‌రెడ్డి ప్రజలను నమ్మించారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలే కాకుండా.. మేనిఫెస్టోలో పేర్కొన్నవన్నీ కలిపి 420 హామీలు ఇచ్చారని, వాటిని ప్రజలకు వివరించి అమలయ్యే వరకు పోరాడుదామని పిలుపునిచ్చారు. హామీలు అమలు చేయకుంటే రోడ్డుపై బట్టలూడదీసి ప్రభుత్వాన్ని నగ్నంగా నిలబెడతామని హెచ్చరించారు. సోషల్ మీడియాను పదునుగా వాడుకొని నరేంద్రమోదీ ప్రధానమంత్రి, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని చెప్పారు. రైతు భరోసా ఇచ్చామంటూ రేవంత్‌రెడ్డి దావోస్‌లో పచ్చి అబద్ధం చెప్పారని, రైతుబంధు పేరు మార్చారే తప్ప.. డబ్బులు ఇవ్వలేదని తెలిపారు. రైతుబంధు పడలేదంటే చెప్పుతో కొడతామంటూ మంత్రి కోమటిరెడ్డి చేసిన వాఖ్యలపై కేటీఆర్ మండిపడ్డారు. రైతు భరోసా రాని70 లక్షల మంది రైతులు ఈ ప్రభుత్వాన్ని చెప్పుతో కొడతారో, ఓట్లతో కొడతారో ఆలోచించుకోవాలన్నారు. క్వింటాల్ ధాన్యానికి ఇస్తామన్న రూ.500 బోనస్ ఇచ్చి తీరాలని డిమాండ్ చేశారు. మార్పు కావాలని ఓట్లు వేసిన 6.5 లక్షల ఆటో కార్మికుల కుటుంబాల కొంప కొల్లేరు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు వారికి ఏ అవకాశమిచ్చినా కాంగ్రెస్‌కు క్రరుకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎరువులు, విత్తనాల దుకాణాల వద్ద క్యూ కట్టాల్సి వస్తుందని ఎవరూ అనుకోలేదని, మళ్లీ ఆ రోజులు వచ్చాయని విమర్శించారు. బస్సుల సంఖ్యను పెంచకుండా, బస్సుల కండిషన్ ఎలా ఉందో తెలుసుకోకుండా అనాలోచితంగా మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయడంతో బస్సుల్లో వారు కొట్టుకుంటున్నారని తెలిపారు. మరోవైపు డబ్బులు పెట్టుకొని వెళ్లే పురుషులకు సీట్లు దొరకడం లేదని, ఎవరూ సంతృప్తిగా లేరని అన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలోని కోటి 57 లక్షల మంది మహిళలకు నెలకు 2,500 ఇవ్వకుంటే తాట తీయాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని అసెంబ్లీలో ప్రశ్నిస్తే.. తాము ఆ హామీ ఇవ్వలేదని భట్టివిక్రమార్క అన్నారని చెప్పారు.


బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ భేటీలో మాట్లాడుతున్న కేటీఆర్

మతం, దేవుళ్లతో బీజేపీ రాజకీయం..

బీజేపీ ఎంపీలు మతం, దేవుళ్లతో దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. నిత్యం మతం, ధర్మం అంటూ రెచ్చగొడుతూ కరీంనగర్‌లో గెలిచిన బండి సంజయ్‌కుమార్ అట్టర్ ఫ్లాప్ ఎంపీ అని విమర్శించారు. వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట రామాలయానికి మోదీ నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదన్నారు. ఐదేళ్లలో సంజయ్ చేసిన అభివృద్ధి ఏంటో మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నలుగురు ఎంపీలను ఓడించింది బీఆర్ఎస్ కాదా? రెండు పార్టీలు ఒకటైతే కామారెడ్డిలో కేసీఆర్ ఓడిపోయేవారా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మోదీ, అదానీ ఒకటేనంటూ రేవంత్, రాహుల్ గాంధీ ప్రచారం చేశారని, ఇప్పుడు ఆయనతోనే ఒప్పందం కుదుర్చుకున్నారని విమర్శించారు. బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్‌లో మోదీ, అదానీ తరువాత.. రేవంత్ మూడో ఇంజన్‌గా మారారన్నారు. కేసీఆర్ సర్కారు పదేళ్లు అదానీని రాష్ట్రంలో అడుగుపెట్టనీయలేదని, అమిత్‌షా, మోదీ సూచనతోనే అదానీతో రేవంత్ ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని విద్యుత్ ప్రాజెక్టులు, ఇతర సంస్థలను అదానీకి కట్టబెడతారన్నారు. రేవంత్ మరో ఏక్‌నాథ్ షిండే అయినా ఆశ్చర్య పోవలసిన అవసరం లేదని, మైనారిటీలు ఆలోచించాలని సూచించారు.


మీడియాతో ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, మహిపాల్‌రెడ్డి

విపక్ష ఎమ్మెల్యేలు సీఎంను కలవకూడదా?

- రేవంత్ తెలంగాణ రాష్ట్రానికి సీఎం కాదా?
- సమస్యల పరిష్కారం కోసమే కలిశాం
- పార్టీని వీడేది లేదు.. ప్రతిపక్షంలోనే ఉంటాం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీత, ప్రభాకర్‌రెడ్డి మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు స్పష్టీకరణ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):"కాంగ్రెస్ పార్టీకే.. రేవంత్ ముఖ్యమంత్రా? తెలంగాణకు కాదా? నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్ష నేతలు సీఎంను కలవకూడదా?" అని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, కె.మాణిక్‌రావు ప్రశ్నించారు. తాము కాంగ్రెస్‌లో చేరుతున్నామంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. రెండ్రోజుల క్రితం ఈ నలుగురు ఎమ్మెల్యేలూ సీఎం రేవంత్‌ను కలవడంతో వారు పార్టీ మారుతున్నారన్న ప్రచారం జోరందుకుంది. ఈ నేపథ్యంలో వారు బుధవారం మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగానే కలిశామని, ప్రజాసమస్యలను చర్చించడంతోపాటు సెక్యూరిటీ, ప్రొటోకాల్ సమస్యలపై కూడా మాట్లాడామన్నారు. ప్రతిపక్షంలో ఉంటే సీఎంను, మంత్రులను కలవకూడదా? ప్రధాని మోదీని, కేంద్రమంత్రులను సీఎం రేవంత్ కలవడం లేదా అని ప్రశ్నించారు. తమ నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం, అభివృద్ధి అంశాల్లో సహకరించాలని సీఎంను కోరామన్నారు. కాంగ్రెస్ లోకి వెళ్లాల్సిన అవసరం తమకు ఏముందని వారు ప్రశ్నించారు. సీఎంను మాత్రమే కాదని, సమస్యల పరిష్కారం కోసం మంత్రులనూ కలుస్తూనే ఉంటామన్నారు. తమపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఆపాలని, లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీ మారే ప్రసక్తే లేదని.. ప్రతిపక్షంలోనే ఉండి పోరాడతామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్సే మెజార్టీ స్థానాల్లో గెలుస్తుందని అన్నారు.

రాహుల్ ప్రజల్లోకి వెళ్తుంటే బీజేపీకి ఎందుకంత భయం?

- గుడికి వెళ్లడానికీ అసోం సీఎం అనుమతి కావాలా?
- అప్పట్లో బతుకమ్మ పేరుతో కవిత మాదిరిగానే ఇప్పుడు రామాలయం పేరుతో మోదీ సినిమా చూపిస్తున్నారు..
- అయోధ్య గుడికి కారకుడైన అడ్వాణీని సన్మానించారా?: జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): "రాహుల్‌గాంధీ ప్రజల్లోకి వెళుతుంటే.. బీజేపీకి ఎందుకంత భయం? రాహుల్ గాంధీ గుడికి పోవద్దా? అందుకు అసోం సీఎం అనుమతి తీసుకోవాలా?" అంటూ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి ప్రశ్నించారు. అసోం ప్రజలకు ఇబ్బంది లేకుండా రాహుల్‌గాంధీ పాదయాత్ర సాగుతోందని, అయితే ప్రధాని మోదీ దగ్గర మెప్పు కోసమే పాదయాత్రను అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ అడ్డుకున్నారని ఆరోపించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన గాంధీ కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీని యాత్ర చేయకుండా అడ్డుకునే కుట్రను బీజేపీ చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు. మోదీ పాలనలో న్యాయమైన పాలన జరగట్లేదని, ధరల పెరుగుదలకూ అడ్డూ అదుపూ లేకుండా పోతోందని విమర్శించారు. దీనిపై ప్రజలను సంఘటితం చేసే పనిలో భాగంగా రాహుల్‌గాంధీ 'న్యాయ్ యాత్ర'ను చేపట్టారని, అసోంలో రాహుల్ యాత్రను బీజేపీ వాళ్లు అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం? అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగానే అసోం ప్రభుత్వం అక్కడ శాంతి భద్రతల సమస్యను సృష్టిస్తోందని ఆరోపించారు. నిన్న మొన్నటిదాకా బతుమ్మ పండుగే లేనట్లుగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బతుకమ్మ పేరుతో సినిమా చూపించిందని, ఇప్పుడు ప్రధాని మోదీ.. రామాలయం పేరుతో సినిమా చూపిస్తున్నారని విమర్శించారు. బీజేపీ నేతలు ఈ మధ్యనే కళ్లు తెరిచి.. రాములవారిని మొక్కాలని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. "రాములవారు పుట్టిన తర్వాత బీజేపీ పుట్టిందా? బీజేపీ పుట్టిన తర్వాత దేవుడు పుట్టాడా? ఆ పార్టీ పుట్టి కేవలం 40 ఏళ్లు అవుతుంది. సీతమ్మ, రాములవారు పుట్టి నాలుగు యుగాలవుతోంది. ప్రధాని మోదీ, ఇక్కడి బీజేపీ నేతలు సీతారాముల కల్యాణం చేస్తారో లేదో తెలియదు నేను. మాత్రం ప్రతియేటా చేస్తాను" అని వ్యాఖ్యానించారు. అయోధ్య గుడికి అసలు కారకుడు బీజేపీ సీనియర్ నేత అడ్వాణీ అని, ఆయన దేశమంతా తిరిగి అయోధ్యలో రామాలయం కట్టాలని ప్రచారం చేశారని చెప్పారు. అలాంటి అడ్వాణీని కనీసం సన్మానించారా? అంటూ బీజేపీ నేతలను నిలదీశారు. సొంత పార్టీ నేత అడ్వానీ త్యాగమే గుర్తించని బీజేపీ.. కాంగ్రెస్ పార్టీ నేతల త్యాగం గుర్తిస్తుందా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌ను ఎందుకు కలిశారో తనకు తెలియదు కానీ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎంను ఎమ్మెల్యేలు కలవాలంటే కుదిరేది కాదన్నారు. గత తొమ్మిదేళ్లలో దక్కని అవకాశాన్ని సీఎం రేవంత్ 2 నెలల్లోనే కల్పించారన్నారు. గత తొమ్మిదేళ్లుగా చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకే సీఎం రేవంత్‌పై బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

ఈసీ ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు

- అమోయ్‌కుమార్, సుశీల్‌కుమార్, శ్రీధర్‌లకు బాధ్యతలు..

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం తిరిగి పోస్టింగులు ఇచ్చింది. ఈమేరకు సీఎస్ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే.. వేటు పడిన అధికారులకు అప్రాధాన్య పోస్టింగులు ఇవ్వడం గమనార్హం. అలాగే సుదీర్ఘకాలం పాటు సింగరేణి సంస్థ సీఎండీగా పని చేసి, ఇటీవల బదిలీ అయి వెయిటింగ్‌లో ఉన్న ఎన్.శ్రీధర్‌కు కూడా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ఆయన్ను షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించింది. ఇప్పటివరకు ఈ బాధ్యతలు చూస్తున్న సాగునీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాను బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది. ఈసీ ఆదేశాలతో పోస్టింగులు కోల్పోయి, వెయిటింగ్‌లో ఉన్న డి.అమోయ్‌కుమార్‌ను పశు సంవర్ధక శాఖ జాయింట్ సెక్రటరీగా, టి.వినయ్‌కృష్ణారెడ్డిని వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీగా, ఎస్.హరీశ్‌ను రవాణా, రోడ్లు-భవనాల శాఖ జాయింట్ సెక్రటరీగా ప్రభుత్వం నియమించింది. గనుల శాఖ డైరెక్టర్‌గా ఉన్న పి.కాత్యాయనిదేవిని బదిలీ చేసి తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(టీఎస్ఐఆర్‌డీ) సీఈఓగా నియమించింది. ఈ పోస్టు అదనపు బాధ్యతలు చూస్తున్న పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాను రిలీవ్ చేసింది. అలాగే వెయిటింగ్‌లో ఉన్న నాన్-కేడర్ అధికారి సుశీల్‌కుమార్‌ను గనుల శాఖ డైరెక్టర్‌గా నియమించింది.

మే నెలలో ఎంసెట్.. నేడు షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే మే నెలలో ఎంసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ గురువారం విడుదలకానుంది. ఎంసెట్‌తోపాటు రాష్ట్రంలో నిర్వహించే ఇతర ప్రవేశ పరీక్షల షెడ్యూళ్లను కూడా ఇదే రోజున అధికారులు విడుదల చేయనున్నారు. ఈ ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఆమోదం తెలిపారు. ఎంసెట్‌తోపాటు లాసెట్, ఐసెట్, ఈసెట్ వంటి ప్రవేశ పరీక్షలను నిర్వహించాల్సి ఉంది. ఈ సెట్ల షెడ్యూల్‌ను ముందుగానే విడుదల చేస్తే అందుకనుగుణంగా విద్యార్థులు సన్నద్ధం కావడానికి అవకాశముంటుంది. అధికారులు కూడా ప్రవేశ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు చేసుకునే వీలుంటుంది. ఈ నేపథ్యంలో ఆయా సెట్లను నిర్వహించే కమిటీలు, కన్వీనర్లను కూడా ప్రకటించనున్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామక ఫైల్‌ను సత్వరం ఆమోదించండి

తమిళిసైతో సీఎం, డిప్యూటీ సీఎం భేటీ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌తో భేటీ అయ్యారు. ప్రభుత్వం తరఫున నిర్వహించే గణతంత్ర దినోత్సవాలకు హాజరు కావాల్సిందిగా ఆమెను ఆహ్వానించారు. గవర్నర్‌తో 20 నిమిషాలపాటు ప్రత్యేకంగా సాగిన సమావేశంలో.. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామకం, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పేర్లపై చర్చించినట్టు సమాచారం. టీఎస్‌పీఎస్సీకి చైర్మన్‌ను నియమించి ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్న ప్రభుత్వం.. రెండు రోజుల క్రితమే దానికి సంబంధించిన ఫైల్‌ను పంపింది. దానికి సత్వరం ఆమోదం తెలపాలని సీఎం, డిప్యూటీ సీఎం ఈ భేటీలో గవర్నర్‌కు విజ్ఞప్తి చేసినట్టు తెలిసింది. ఆ ప్రక్రియ ముగిసిన వెంటనే సభ్యులకు సంబంధించిన జాబితాను కూడా పంపిస్తామని చెప్పినట్టు సమాచారం. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నందున ఈ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు వారు గవర్నర్‌కు వివరించారు. తమిళిసై కూడా దీనికి సంబంధించి మరిన్ని వివరాలు అడిగి తెలుసుకున్నట్టు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. ఇక గవర్నర్ కోటా ఎమ్మెల్సీల విషయానికి వస్తే.. గత ప్రభుత్వం దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను ప్రతిపాదించగా, వారిని నామినేట్ చేయడానికి తమిళిసై నిరాకరించిన సంగతి తెలిసిందే. గవర్నర్ కోటాలో నియమితులయ్యేవారు సాహిత్యం, శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం, సమాజ సేవ వంటి రంగాల్లో నిష్ణాతులై ఉండాలి. ఈ అర్హతలు లేవంటూ దాసోజు, కుర్ర పేర్లను గవర్నర్ తిరస్కరించారు. ఈ నేపథ్యంలో.. రేవంత్ సర్కారు ఆ కోటా కింద ఇద్దరి పేర్లను ప్రతిపాదిస్తూ ఫైల్‌ను గవర్నర్‌కు పంపాలని భావించింది. అయితే ఈలోగా దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ కోర్టుకు వెళ్లారు. తమ పేర్లను తిరస్కరించడం చట్టవిరుద్ధమని.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా తమను నామినేట్ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని వారు కోర్టును కోరారు. దీంతో.. ఈ విషయం కోర్టులో ఉన్నందున తాను నిర్ణయం తీసుకోలేనని రేవంత్ సర్కారుకు గవర్నర్ స్పష్టం చేశారు. తాజాగా బుధవారం ఈ కేసును అడ్మిట్ చేసుకున్న న్యాయస్థానం.. ఎమ్మెల్సీలుగా కొత్త ప్రభుత్వం ప్రతిపాదించినవారిని గవర్నర్ నామినేట్ చేయకుండా స్టే ఇవ్వడానికి నిరాకరించింది. కాబట్టి ఈ ప్రక్రియపై ముందుకు వెళ్లొచ్చనే అభిప్రాయంలో ఉన్న ప్రభుత్వం.. ఆ విషయాన్ని గవర్నర్‌కు తెలిపింది. తాము ఈ కోటాకు అర్హులైన వ్యక్తులనే సిఫారసు చేస్తామని రేవంత్, భట్టి బుధవారం భేటీలో తమిళిసైకి వివరించగా.. దీనిపై న్యాయసలహా తీసుకుంటానని ఆమె చెప్పినట్టు తెలిసింది. ఫిబ్రవరి 2వ వారంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలు నిర్వహించే ఉద్దేశంతో ఉన్న నేపథ్యంలో రేవంత్, భట్టి ఆ విషయాన్ని కూడా గవర్నర్ వద్ద ప్రస్తావించినట్టు సమాచారం. కాగా.. గత కేసీఆర్ సర్కారు తీరుకు భిన్నంగా గణతంత్ర దినోత్సవాలకు గవర్నర్‌ను నేరుగా కలిసి ఆహ్వానించిన సీఎం, డిప్యూటీ సీఎం.. గవర్నర్ ప్రసంగానికి సంబంధించిన విషయాలను కూడా వివరించారు.


రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.3, కనిష్ఠం 19.8





ఏసీబీకి పట్టుబడిన మున్సిపల్ అధికారులు



ఏసీబీ వలలో చిక్కిన కార్మికశాఖ అధికారి, ఆయన కుమారుడు (ఫైల్)



ఏసీబీకి చిక్కిన కడెం తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ (ఫైల్)

- జిల్లాలో ఏసీబీ వరుస దాడులతో అవినీతి అధికారుల బెంబేలు
- వ్యూహాత్మకంగా ఇన్‌ఫార్మింగ్ నెట్‌వర్క్ విస్తరణ
- పలు శాఖలపై ఫిర్యాదుల వెల్లువ
- సమాచారమిస్తున్న వ్యక్తుల వివరాల పట్ల గోప్యత

ఏసీబీ పంజా!



మామడ పీఎస్‌లో ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న నగదు



నిర్మల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత కొద్దిరోజుల నుంచి అవినీతి నిరోధక శాఖ అధికారులు జరుపుతున్న వరుస దాడులు అక్రమార్కుల గుండెల్లో దడ పుట్టిస్తున్నాయి. ఏసీబీ అధికారులు వ్యూహాత్మకంగా గత కొంత కాలంగా ఇన్‌ఫార్మింగ్ నెట్‌వర్క్‌ను విస్తరించుకోవడంతో వరుసదాడులకు ఆస్కారం ఏర్పడుతోందని అంటున్నారు. ముఖ్యంగా ఏసీబీ డీఎస్పీగా రమణమూర్తి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నిర్మల్ జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలోని కొన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది తమకున్న పలుకుబడి, పరపతితోపాటు రాజకీయ అండదండలతో ఇష్టారాజ్యంగా అవినీతికి పాల్పడుతున్న అంశాన్ని ఏసీబీ అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. డీఎస్పీ ఆధ్వర్యంలో జిల్లాపై ప్రత్యేక నిఘా సారించారు. ఇందులో భాగంగానే లంచావతారులపై తమకు సమాచారం అందించాలంటూ పోస్టర్ల ద్వారా సోషల్ మీడియా ద్వారా విస్తృతప్రచారం కల్పించారు. దీనికి అనుగుణంగా మున్సిపల్ ప్రాంతాల్లోనూ, మండలకేంద్రాల్లోనూ ఇన్‌ఫార్మింగ్ నెట్‌వర్క్ విస్తరణపై దృష్టి కేంద్రీకరించారు. క్రమంగా ఏసీబీ అధికారుల వ్యూహం ఫలించింది. పలుచోట్ల అవినీతి అధికారులపై కొంతమంది ధైర్యంగా ఏసీబీకి ఫిర్యాదు చేసేందుకు ముందుకు వచ్చారు. ఇలా వరుసగా అధికారుల లంచాల పీడింపు పెరగడం, దీంతోపాటు బాధితుల సంఖ్య కూడా రెట్టింపు అవ్వడంతో ఇక సామాన్య ప్రజలు ఏసీబీ అధికారులను సంప్రదించే స్థాయి ఏర్పడింది.

మొదట ఫోన్ ద్వారా ఏసీబీ అధికారులను సంప్రదిస్తున్న బాధితులు వారికి తమను లంచాల కోసం పీడిస్తున్న అధికారులు, సిబ్బందిపై ఆన్‌లైన్‌లో ఫిర్యాదుచేస్తున్నారు. ఈ ఫిర్యాదులపై స్పందిస్తున్న ఏసీబీ అధికారులు అప్పటికప్పుడే లంచావతారులను పట్టుకునేందుకు వ్యూహం రూపొందించి పకడ్బందీగా వల పన్నుతున్నారు. ఏసీబీ అధికారుల వలలో సునాయసంగా అవినీతి అధికారులు చిక్కుకుంటుండడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. కొద్దిరోజుల నుంచి లంచావతారులపై రెడ్‌హ్యాండెడ్ దాడులు సర్వత్రా చర్చనీయాంశమవుతున్నాయి.

వరుస దాడులతో దడ

గత కొద్దిరోజుల నుంచి లంచావతారులపై వ్యూహాత్మకంగా ఏసీబీ అధికారులు జరుపుతున్న దాడులు అక్రమార్కులను బెంబేలెత్తిస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం నిర్మల్ జిల్లా కేంద్రంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై దాడిజరిపిన ఏసీబీ అధికారులు లంచం తీసుకుంటున్న జూనియర్ అసిస్టెంట్‌తో పాటు ఓ ప్రైవేటు వర్కర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అలాగే కడెం మండలానికి చెందిన తహసీల్దార్‌తోపాటు డిప్యూటీ తహసీల్దార్ ఓ రైతు నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఓ మెజిస్ట్రేట్ స్థాయి అధికారిని ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడం అప్పట్లో కలకలం రేపింది. ఈ ఘటన మరువక ముందే జిల్లాకేంద్రంలో అసిస్టెంట్ లేబర్ వెల్ఫేర్ అధికారితో పాటు ఆయన కొడుకు లంచం తీసుకుంటుండడం స్వయంగా ఆయన ఇంట్లోనే ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. దీంతో పాటు మామడ మండల ఎస్సై కూడా ఏసీబీ అధికారులకు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. తాజాగా జిల్లాకేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో ఓ వ్యక్తి నుంచి లంచం తీసుకుంటూ రెవెన్యూ ఆఫీసర్, బిల్ కలెక్టర్‌లపై ఏసీబీ అధికారులు దాడి జరిపి వారిని పట్టుకున్నారు. ఇలా రెడ్‌హ్యాండెడ్ దాడులే కాకుండా అవినీతి అక్రమాలు జరిగాయన్న ఆరోపణలున్న పలు శాఖలు, రెసిడెన్షియల్ పాఠశాలలపై కూడా ఏసీబీ అధికారులు ఫోకస్‌పెట్టారు. ఇందులో భాగంగానే బుధవారం ముథోల్ మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఆకస్మికంగా ఏసీబీ అధికారులు తనిఖీలు చేయడం కలకలం రేపుతోంది. ఈ స్కూల్‌లో అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులున్నాయి. ముఖ్యంగా ఫర్నీచర్ కొనుగోలుతోపాటు ఇతర సామగ్రి కొనుగోళ్లలో భారీఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయన్న ఫిర్యాదు మేరకు అధికారులు దాడులు జరిపారు.

పలు శాఖలపై ఫిర్యాదుల వెల్లువ

ముఖ్యంగా పలు ప్రభుత్వ శాఖల్లో పెద్దఎత్తున అవినీతి జరుగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భూముల విషయంలో రెవెన్యూ శాఖతోపాటు సర్వేల్యాండ్ రికార్డ్స్, మున్సిపాలిటీ, సబ్‌రిజిస్ట్రార్, రవాణాశాఖ, ఇంజనీరింగ్ శాఖలైన పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, పంచాయతీ శాఖలతో పాటు తదితర శాఖల్లో అవినీతి ఇష్టానుసారంగా జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. పలు శాఖల్లో పనిచేస్తున్న కొంతమంది అధికారులు, సిబ్బందికి రాజకీయంగా పుష్కలంగా అండదండలు ఉండడంతో వారంతా యేళ్ళ నుంచి ఒకే చోట కొనసాగుతున్నారు.

ఇన్‌ఫార్మింగ్ నెట్‌వర్క్ విస్తరణ..

ఏసీబీ అధికారులు అవినీతి అక్రమార్కులను పట్టుకునేందుకు ఇన్‌ఫార్మింగ్ నెట్‌వర్క్‌ను విస్తరించుకుంటున్నారంటున్నారు. జిల్లా, మండలకేంద్రాలతోపాటు పలు మున్సిపాలిటీల పరిధిలో ఏసీబీ అధికారుల వివరాలను తెలుపుతూ విస్తృతంగా ప్రచారం చేపడుతున్నారు. ముఖ్యంగా లంచాల బాధితులకు వారు పరోక్షంగా భరోసా కల్పిస్తూ వారి వివరాలను గోప్యంగా ఉంచుతామంటూ అభయమిస్తున్నారు.

ఏసీబీ వలకు బిల్ కలెక్టర్, ఆర్ఐ

- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు

ఇంటికి అసెస్మెంట్ నెంబర్ కేటాయించేందుకు లంచం డిమాండ్ చేసిన ఇద్దరు మున్సిపల్ అధికారులు మంగళవారం ఏసీబీకి చిక్కారు. నిర్మల్‌లోని ఏఎన్‌రెడ్డికాలనీకి చెందిన వెలమ గోపాల్‌రెడ్డి గతేడు జనవరిలో నిర్మల్ మున్సిపాలిటీ నుంచి అనుమతి పొంది తన ఇంటిని నిర్మించుకున్నాడు. ఇంటికి అసెస్మెంట్ నెంబర్ కేటాయించాలని ఇటీవల మున్సిపల్ అధికారులను సంప్రదించాడు. దీంతో గోపాల్‌రెడ్డిని మున్సిపల్ ఆర్ఐ గంగాధర్, బిల్ కలెక్టర్ నవంత్ కలిసి రూ.10 వేల లంచం డిమాండ్ చేశారు. ఈ విషయమై బాధితుడు నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్‌ను సంప్రదించగా.. ఆయన వెంటనే వారికి ఫోన్ చేయగా పని చేసి పెడతామని చెప్పారు. అయినప్పటికీ రూ.3,500 ఇవ్వాల్సిందేనని చెప్పడంతో విసుగు చెందిన బాధితుడు గోపాల్‌రెడ్డి రెండురోజుల క్రితం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ముందస్తు పథకం ప్రకారం మున్సిపల్ కార్యాలయంలో గోపాల్‌రెడ్డి.. బిల్ కలెక్టర్ నవంత్‌కు డబ్బులు ఇస్తుండగా అధికారులు పట్టుకున్న ఘటన జిల్లాలో కలకలం రేపింది.



స్టోర్ రూమ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ముథోల్ గురుకులంలో ఏసీబీ తనిఖీలు

ముథోల్, జనవరి24: నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకులపాఠశాలలో బుధవారం ఏసీబీ డీఎస్పీ వీవీ రమణమూర్తి ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. గురుకుల పాఠశాల నిర్వహణ పట్ల ఆరోపణలు రావటంతో ఏసీబీ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. భోజన శాల, కొనుగోలు చేసిన ఫర్నిచర్, విద్యార్థుల హాజరు పట్టి, స్టోర్ రూమ్, తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈయన వెంట ఏసీబీ సీఐలు సునీల్, జాన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నేతలు

‘సీఎం సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి’

నిర్మల్ అర్బన్, జనవరి 24: సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో నిర్మల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తానని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావు అన్నారు. మామడ మండలం ఆదర్శనగర్ సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, కొరిటికల్ ఎంపీటీసీ సౌజన్య రాజేశ్వర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లింగారెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్‌లు బుధవారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పినా ఆ పార్టీ నాయకుల్లో మార్పు రాలేదని అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలను అమలుచేస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

అధైర్యపడకండి.. అండగా ఉంటాం

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విఠల్‌రెడ్డి

లోకేశ్వరం, జనవరి 24: గెలుపు, ఓటములు సహజమని, ఓడినంత మాత్రాన నాయకులు అధైర్యపడవద్దని, ఎల్లవేళలా అందుబాటులో ఉండి అండగా ఉంటానని నిర్మల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పార్టీ నాయకులకు మనోధైర్యాన్నిచ్చారు. బుధవారం లోకేశ్వరం మండలంలోని పిప్రిలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన తొమ్మిదిన్నరేళ్లపాటు పార్టీకి అండగా ఉన్న కార్యకర్తలను మరిచిపోవద్దని అన్నారు. సమావేశంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ మాజీచైర్మన్ లోలం శ్యాంసుందర్, ఎంపీపీ లలిత భోజన్న, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, మండల బీఆర్ఎస్ కన్వీనర్ కరిపే శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేస్తా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే


భైంసారూరల్, జనవరి24: అందరి సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే రామారావుపటేల్ అన్నారు. మంగళవారం ఎంపీపీ రజాక్ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయనపాల్గొని మాట్లాడారు. అంతకు ముందు ఆయాశాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తమ సమస్యలను అధికారులకు, ఎమ్మెల్యేకు చెప్పారు. విద్యుత్ శాఖ, మిషన్ భగీరథ ఏఈల పని పట్ల సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు సమయపాలన పాటించి సకాలంలో విధులకు హాజరై ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే హెచ్చరించారు. పని తీరు మార్చుకోకపోతే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకెళ్తూ ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. పెండింగ్ బిల్లులు అందేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే చెప్పారు. సిరాల, తిమ్మాపూర్, వానల్‌పాడ్, ఆయా గ్రామాల చెరువుల పునఃనిర్మాణం, మరమ్మతుల పనులు త్వరలో ప్రారంభ మయ్యేలా చూస్తామని అన్నారు. పట్టణంతో పాటు నియోజకవర్గంలో 8 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస అవుతున్నట్లు తెలిసిందని అన్నారు. ఆ విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రతీ పాఠశాలకు ఎక్సైజ్ అధికారులు మత్తు పదార్థాలతో కలిగే నష్టం గురించి వివరించారు. ఫిబ్రవరి 1న పదవీ కాలం పూర్తి చేసుకుంటున్న సర్పంచ్‌లను ఎంపీపీ, కార్యాలయ సిబ్బంది పూలమాల, శాలువాతో సన్మానించారు.

- క్రికెట్ టోర్నీని ప్రారంభించిన ఎమ్మెల్యే

మండలంలోని దేగాం గ్రామంలో ఎమ్మెల్యే రామారావు పటేల్ పవార్ అనసూయ బాయి జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం ప్రారంభించారు. క్రీడలతో మానసిక ప్రశాంతతతో పాటు శారీరకంగా దృఢంగా ఉంటారన్నారు. యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. మొదటి బహుమతి రూ. 30వేలు, రెండో బహుమతి రూ.15 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ నర్సారెడ్డి, ఎంపీడీవో గోపాల కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, ఎంపీవో మోజాం హుస్సేన్, నాయకులు సోలంకి భీమ్ రావు, పండిత్ రావు, సాంప్లీ రమేష్, మాజీ ఎంపీపీ రమణరావు, వెంగల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సమీకృత వ్యవసాయ విధానాన్ని అవలంబించాలి: కలెక్టర్

నిర్మల్ కల్చరల్, జనవరి24: స్వయం సహాయక సంఘాలు సమీకృత వ్యవసాయ విధానాన్ని అలవర్చుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టర్ భవనంలో మెగా రుణ వితరణ కార్యక్రమాన్ని తెలంగాణ గ్రామీణ బ్యాంకు, ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న స్వయం సహాయక సంఘాల్లో నిర్మల్ తక్కువ మొండి బకాయి, అతి ఎక్కువ లింకేజీలతో అగ్రస్థానంలో నిలిచిందన్నారు. సమీకృత వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఆక్వా బిజినెస్, దేశిపౌల్ట్రీ, డైరీ మిల్క్ తదితర వాటిపై వివరించారు. బ్యాంకు నుంచి పొందిన రుణాలతో వ్యాపార రంగంలో అభివృద్ధి సాధించాలని అన్నారు. గ్రామీణ బ్యాంకు చైర్మన్ శోభా మాట్లాడుతూ ప్రతీ మహిళా పారిశ్రామిక వేత్తగా మారాలని బ్యాంకు రుణాలు సద్వినియోగపర్చుకోవాలని అన్నారు. డీఆర్డీవో విజయలక్ష్మి, బ్రాంచ్ మేనేజర్ రాజశేఖర్‌రెడ్డి, గోవింద రావు, తదితరులు పాల్గొన్నారు. 50 కోట్ల రూపాయల చెక్కు కలెక్టర్ ఐకేపీ మహిళలకు అందజేశారు.



చెక్కు అందజేస్తున్న కలెక్టర్

- దివ్యాంగులు అన్నిరంగాల్లో ముందుండాలి

దివ్యాంగులు చదువు, ఆటలతోపాటు అన్నిరంగాల్లో ముందుండాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆకాంక్షించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా టీఎన్జీవో సంఘ భవనంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని సూచించారు. ఉత్తమ దివ్యాంగుల సర్టిఫికెట్లతోపాటు ఆటల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. 8మంది అర్హులకు స్కూటీలు పంపిణీ చేశారు. జిల్లా సంక్షేమ అధికారి వైపీ. రమేష్, సీడీపీవో నాగమణి, స్వాతి, మూర్తి, మధుసూదన్‌రెడ్డి, సగ్గం రాజు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ యాత్రను అడ్డుకోవడం శోచనీయం

- ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్

భైంసా, జనవరి 24: అస్సోం రాష్ట్రంలో ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న భారత్ న్యాయ్ యాత్రపై అక్కడి బీజేపీ శ్రేణులు అడ్డుకోవడం శోచనీయమని ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ అన్నారు. బుధవారం భైంసాలో బీఆర్ఎస్ నుంచి పలువురు నాయకులకు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారిని నారాయణరావ్ పాటిల్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ న్యాయ్ యాత్రకు పెరుగుతున్న జనాధరణను చూసి ఓర్వలేకనే అక్కడి బీజేపీ శ్రేణులు పథకం ప్రకారమే యాత్రను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. యాత్రకు అడుగడుగున అపూర్వ స్పందన వస్తుండటంతో బెంబేలెత్తిపోయి అనైతిక చర్యలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. ఈ సందర్భంగా లోకేశ్వరం మండలంలోని రాయపూర్ కాండ్లీ మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి కిష్టపూర్ గ్రామానికి చెందిన లోకేశ్వరం పీఏసీఎస్ డైరెక్టర్ సోమ సుధీర్ రెడ్డిలు తమ తమ అనుచరగణంతో కలిసి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే నారాయణరావ్ పాటిల్, యువ నాయకులు బోస్లే అఖిలేష్ పాటిల్‌లు పార్టీ కండువాలు వేసి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.



కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువా వేస్తున్న దృశ్యం

లోకేశ్వరంలో కత్తిపోట్ల కలకలం

లోకేశ్వరం, జనవరి24: లోకేశ్వరం మండల కేంద్రంలో మంగళవారం రాత్రి కత్తిపోట్ల కలకలం ఆలస్యంగా వెలుగుచూసింది. మండల కేంద్రానికి చెందిన రెడ్డిశెట్టి గణేష్ అనే పెట్రోల్ బంక్ యజమానిపై అదే గ్రామానికి చెందిన నర్సాగౌడ్ అనే వ్యక్తి మంగళవారం కత్తితో దాడిచేయగా బాధితుడు ప్రాణ భయంతో పరుగులు తీశాడు. చికిత్స కోసం బాధితుడిని భైంసాకు తరలించినట్లు సమాచారం. నిందితుడు గత కొంతకాలంగా విచిత్రంగా ప్రవర్తిస్తున్నాడని, గతంలో కూడా పలువురిపై దాడి చేసినట్లు తెలిసింది. పెట్రోల్ బంక్ యజమాని గణేష్ బయటకూర్చుని ఉండగా ఆకస్మాత్తుగా ఎలాంటి కారణం లేకుండానే కత్తితో దాడికి పాల్పడ్డాడని సమాచారం. కాగా ఈ సంఘటనపై ఇంతవరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని, అందుకే కేసునమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.

చిరుత గుర్తింపు కోసం అధికారుల గాలింపు

కుంటాల, జనవరి24: మండలంలోని కల్లూర్ శివారులో పంట పొలాల్లో చిరుతపులి సంచరిస్తుందన్న రైతుల సమాచారం మేరకు బుధవారం అటవీశాఖ అధికారులు కల్లూర్ గ్రామానికి వచ్చి వ్యవసాయ పంటపొలాల్లో పరిశీలించారు. గ్రామానికి చెందిన రైతుల సమాచారం మేరకు చిరుతపులిని గుర్తించేందుకు ఐదుచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా అధికారులు 3 బృందాలుగా ఏర్పడి పంట పొలాల్లో పరిశీలించారు. పరిశీలించిన అనంతరం అవసరమైతే మరిన్ని అదనపు కెమెరాలు ఏర్పాటుచేసి ప్రత్యేక బలగాలను రప్పించి చిరుత సంచరిస్తున్న ప్రాంతాలను గుర్తిస్తామని, రైతులు భయాందోళనకు గురికావద్దని, పంట పొలాలకు వెళ్లేటప్పుడు ఒక్కరు కాకుండా ఎక్కువ మంది కలిసివెళితే బాగుంటుందని అధికారులు సూచించారు. ఎఫ్ఆర్‌వో రాథోడ్ రమేష్, ఎఫ్ఎస్‌వో శ్రీనివాస్, డీఆర్‌వో రేష్మ, ఎఫ్‌బీవోలు ముస్తాక్‌అలీ, ఫజల్ హుస్సేన్, మీనా, స్రవంతి, హరిలత, అనుపమ, తదితరులు ఉన్నారు.

‘బీసీ గురుకులాలకు శాశ్వత భవనాలు నిర్మించండి’

నిర్మల్ కల్చరల్, జనవరి24: జిల్లాలోని బీసీ గురుకులాలకు శాశ్వతభవనాలు నిర్మించాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ మంత్రి సీతక్క, ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావును కోరారు. బుధవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో జిల్లాలో శాశ్వత భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

పోషకులకు క్రీడా పోటీలు

నిర్మల్‌చైన్‌గేట్, జనవరి 24: గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని నిర్మల్‌లోని విజయ ఉన్నత పాఠశాలలో పోషకులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ ఆటల పోటీలను విజయ పాఠశాల యాజమాన్య బృంద సభ్యులు ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నల్ల ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ వివిధ కార్యక్రమాల ద్వారా తల్లిదండ్రులు జీవితంలో క్రీడాస్ఫూర్తితో మెలగాలని, తమ పిల్లలకు ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. నిర్మల్ జిల్లా ఒలంపిక్ కమిటీ చైర్మన్ అయ్యన్నగారి భూమయ్య మాట్లాడుతూ రోజువారీ కార్యక్రమాల్లో బిజీగా ఉండే తల్లిదండ్రులకు ఇటువంటి ఆటల వలన మానసిక ఆనందం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సామ మోహన్‌రెడ్డి, కరస్పాండెంట్ మంచిర్యాల నాగభూషణం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేజీబీవీలో బేటీ బచావో-బేటీ పడావో

దిలావర్‌పూర్, జనవరి24 : మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బేటీబచావో-బేటీ పడావో కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.